# కథ

# పక్కింటి మీనాక్షి

-దుట్టా సదాశివ

**"ఏమండీ ఇది విన్నారా?" కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంతో అంది వనజాక్షి.**

**"నువ్వు ఏమి చెప్పకుండా ఏమిటి వినేది" విసుగ్గా మొహం పెట్టాడు సుబ్బారావు.**

**"మన పక్కింట్లో అద్దెకు దిగిన మీనాక్షిగారికి జనరల్ నాలెడ్జి చాలా ఎక్కువండి. ఆమె బుర్ర నిండా ఆలోచనలే" వనజాక్షి ఉత్సాహంగా చెబుతూంది.**

''పనికొచ్చేవా? పనికిరానివా?'' కాస్త చిరాగ్గా ప్రశ్నించాడు సుబ్బారావు. పెళ్లై మూడేళ్లయినా తన భార్య పక్కింటివాళ్ల గురించి ఎప్పుడూ పొగడటం వినలేదు సుబ్బారావు.

''మీనాక్షిగారు 'వై' టీవీ వాళ్లు నిర్వహించిన 'ఆడవాళ్లు-గడుసువాళ్లు' అనే ప్రోగ్రాంలో 10 గ్రాముల బంగారం గెల్చుకుందండి. 'మన' టీవీవాళ్లు మొన్న నిర్వహించిన 'ఆడవాళ్లు-మహామొండి' ప్రోగ్రాంలో రెండు కిలోల వెండి గెల్చుకుందండి. ఇంకా...'' వనజాక్షి మాటలని మధ్యలో అడ్డుకున్నాడు సుబ్బారావు.

''అయితే మనకేమిటంట?'' అసహనంగా మొహం పెట్టాడు సుబ్బారావు.

''టీవీ ప్రోగ్రాంలో జరిగే పోటీ కార్యక్రమాలు గురించి, వాటిలో అడిగే ప్రశ్నలు, వాటికి సరైన సమాధానాలు, బహుమతులు ఎలా గెలుచుకోవాలి అనే విషయాల మీద మీనాక్షి గారికి మంచి అవగాహన ఉంది. ప్రోగ్రాంలో గెలవటానికి మెళకువలు నాలుగు వారాలు పాటు కాలనీలోని ఆడవాళ్లకి క్లాసులు కండక్ట్ చేస్తుందండి. ఫీజు రెండు వేల రూపాయలు. ఒక్క ప్రోగ్రాంలో బహుమతి వస్తే ఫీజుకి పదిరెట్లు సంపాదించినట్లే. నేను మీనాక్షిగారి కోర్సులో చేరతానండి'' చివరి మాటలు కొంచెం తియ్యగా పలికింది వనజాక్షి. తన భార్య బుర్రలోకి ఏదైనా ఆలోచన వస్తే అది జరిగిపోవాలి. లేకుంటే తనకి పస్తులేనన్న విషయం సుబ్బారావుకి తెలుసు. ''రెండు వేలంటే కొంచెం ఎక్కువనుకుంటా. పోనీ ఫీజు ఇన్‌స్టాల్‌మెంట్‌లో కట్టవచ్చేమో కనుక్కో?'' సుబ్బారావు ప్రశ్నకి కస్సుమని లేచింది వనజాక్షి.

''రెండు వేల ఫీజుకి ఇన్‌స్టాల్‌మెంట్ అడిగితే అందరూ నవ్వుతారండి. కాలనీలో మన స్టేటస్ పడిపోతుందండి.''

''సరే వనం! నీ ఇష్టం!'' బలవంతంగా ఇకిలించాడు సుబ్బారావు.

★ ★ ★

రిసీవర్ ఎత్తి, నెంబరు డయల్ చేసి, ''హలో'' అన్నాడు అప్పారావు. ''మూర్ఛపోయానండి!'' అవతల నుంచి వచ్చిన సమాధానం విని ఉలిక్కి పడ్డాడు అప్పారావు. తను పొరపాటు విన్నాననుకుని మళ్లీ ''హలో'' అన్నాడు అప్పారావు.

''మూర్ఛపోయానండి'' అవతల నుండి మళ్లీ అదే సమాధానం. ఆ గొంతు గుర్తుపట్టాడు అప్పారావు.

''అది సుబ్బారావుగారి ఇల్లేనాండీ. నేను అప్పారావుని మాట్లాడుతున్నాను'' గట్టిగా అరిచాడు అప్పారావు.

''అరె అప్పారావు, నేను సుబ్బారావుని మాట్లాడుతున్నాను'' అవతల నుండి సుబ్బారావు గొంతు వినిపించింది.

''ఇంతకు ముందు రెండుసార్లు 'మూర్ఛపోయానండీ' అని సమాధానం వచ్చింది. ఆర్ యు ఆల్‌రైట్ సుబ్బారావ్'' ఆందోళనతో అడిగాడు అప్పారావు.

''ఏం చెప్పమంటావురా అప్పారావు. 'మన' టీవీలో అదేదో మూర్ఛపోయే ప్రోగ్రాం ఉందట. వాళ్లు మన ఇంటికి ఫోను చేస్తూనే మనం ''మూర్ఛపోయానండి'' అని సమాధానం చెప్పాలట. నా భార్య వంట చేస్తూ, ఆ పని నాకు అప్పచెప్పింది. నాతో ఏమైనా అర్జెంటు పని ఉందా? ఈ మూర్ఛపోయే ప్రోగ్రాం అయిన వెంటనే నేనే నీకు ఫోన్ చేస్తా'' అంటూ ఫోన్ పెట్టేశాడు సుబ్బారావు.

★ ★ ★

''ఫోను కొట్టండి. కోటి కొట్టేయండి'' ప్రోగ్రాంకి మీ అందరికీ స్వాగతం, సుస్వాగతం'' తెలుగు చిత్ర సీమలోని పెద్ద హీరో అభిమన్యు తనదైన స్టైల్‌లో పలికాడు. ఎదురుగా కుర్చీలోనున్న అతనిని చూపిస్తూ, ''ఈరోజు ఈ ప్రోగ్రాంకి వచ్చిన వట్టి సుబ్బారావుగారికి బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ ఈ ప్రోగ్రాంలో మొదటి ప్రశ్నని సుబ్బారావుగారి మీదకు వదలమని కంప్యూటర్‌గారిని కోరుతున్నాను'' స్క్రీన్ మీద ప్రశ్న వచ్చింది.

''మానవుడికి తోక ఉంటే, దానితో ఏమి చేసేవాడు?

(ఎ) చీపురులా ఉపయోగించేవాడు.
(బి) తోకతో ఒకరినొకరు కొట్టుకునేవారు.
(సి) దోమలని, ఈగలని తోలుకునేవారు.
(డి) కోతి కొమ్మొచ్చిలాట ఆడుకునేవారు.

వట్టి సుబ్బారావుగారు మీ మెదడుని గట్టిగా తట్టి లేపే ప్రశ్న'' అంటూ సినీ హీరో అభిమన్యు గట్టిగా అరిచాడు. సుబ్బారావు కొన్ని క్షణాలు బుర్ర గోక్కున్నాడు. కళ్లు మూసుకుని వెంటనే కళ్లు తెరచి ''(సి) దోమలని, ఈగలని తోలుకునేవారు'' ఠక్కున సమాధానం చెప్పాడు సుబ్బారావు. ఒక నిమిషం నిశ్శబ్దం. నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ ''కరెక్టు'' అంటూ గట్టిగా అరిచాడు సినీ హీరో. ''వట్టి చేతులతో వచ్చిన వట్టి సుబ్బారావుగారు మొదటి సమాధానంతో లక్ష రూపాయలు గెలుచుకున్నారు'' సినీ హీరో అభిమన్యు మాటలతో చప్పట్లు మారుమ్రోగాయి.

''కంప్యూటర్‌గారు! సుబ్బారావుగారు మీదకి రెండో ప్రశ్న విసరండి!'' స్క్రీన్ మీద రెండో ప్రశ్న ప్రత్యక్షమైంది.

''భగవంతుడు ప్రత్యక్షమై క్రింద వాటిలో ఒకటి కోరుకో మంటే మీరు ఏది కోరుకుంటారు (ఎ) దీర్ఘాయుష్షు (బి) సంపద (సి) ఆరోగ్యం (డి) అధికారం''


సరైన సమాధానం కోసం సుబ్బారావు మెదడు పాదరసంలా పనిచేయటం మొదలు పెట్టింది. మనిషికి దీర్ఘాయుష్షు కావలిసిందే. అలాగని సంపద లేకుండా దీర్ఘాయుష్షు ఏం చేసుకుంటాం. ఆరోగ్యం లేకుండా సంపద

వేస్ట్. ఈ కాలం అధికారం లేకపోతే మనిషికి ఏమి ఉన్నా వేస్ట్. తన మట్టిబుర్రకి గట్టి ప్రశ్నే. బుర్రని చేత్తో గట్టిగా కొట్టబోయాడు సుబ్బారావు. పెద్ద శబ్దం వినిపించటంతో చటుక్కున మెలకువ వచ్చింది సుబ్బారావుకి. ''అంటే ఇదంతా కల. ఏమిటి నాకు కూడా ఈ టీవీ ప్రోగ్రాంల పిచ్చి పట్టుకుందా. సుబ్బారావు మెల్లగా కళ్లు తెరిచి చూశాడు. ఎదురుగుండా కనిపించిన దృశ్యం చూసి గట్టిగా అరవాలనుకున్నాడు. కళ్లు మూసుకుని వెనక్కి నడుస్తోంది తన భార్య. ఆమెకు దెయ్యం పట్టిందా అన్న అనుమానం వచ్చింది సుబ్బారావుకి. మంచం మీద నుండి గబుక్కున లేచి భార్య భుజాలు పట్టుకుని ''వనం, వనం! ఏమైంది నీకు?'' అంటూ గట్టిగా అరిచాడు. ఉలిక్కిపడిన వనజాక్షి ఠక్కున కళ్లు తెరిచింది. ''ప్రోగ్రాంకి ప్రాక్టీస్ చేస్తున్నానండి. కళ్లు మూసుకుని వెనక్కి నడవటం, జడ వేసుకోవటం, బొట్టు పెట్టుకోవటం, వీటిలో ప్రావీణ్యం సంపాదిస్తే బహుమతి కొట్టెయ్యవచ్చు. కిరీటం దక్కించుకోవచ్చు'' మంచం మీద కూర్చుంటూ అంది వనజాక్షి.

''నీకు కాలో, చెయ్యో విరిగి మంచాన పడితే నా గతేమిటి, వనం?'' సుబ్బారావు గొల్లుమన్నాడు. వెంటనే తేరుకుని, ''నీకు ఏమి సామాన్లు కావాలో చెప్పు, వెట్‌గ్రైండర్, ఓవెన్, ఫ్రిజ్, ఫ్లాట్ స్క్రీన్ టీవీ, వెంటనే లోను తీసుకుని వెంటనే కొని తెచ్చేస్తాను. నువ్వు మాత్రం ఈ టీవీ ప్రోగ్రాంలో పాల్గొనటం గురించి మరిచిపో'' బతిమాలుకున్నాడు సుబ్బారావు.


''అయ్యో! కొనుక్కుంటే ఆ ఆనందం ఎలా వస్తుందండీ? మొన్న ప్రక్క వీధిలో ఉండే రామలక్ష్మి 'మగువా! ఏమి నీ తెగువ' కార్యక్రమం లో మిక్సీ గెలుచుకుని వచ్చిన తర్వాత నెల రోజుల వరకు ఆమె మొహం కాంతితో వెలుగుతూనే ఉంది.''

వనజాక్షి సమాధానానికి ఏడవాలో నవ్వాలో తెలియలేదు. వనజాక్షి ఉత్సాహంగా చెప్పుకుంటూ పోతుంది. 'ఎన్' టీవీలో నిర్వహించే ''కెవ్వున అరవండి-రివ్వున ఎగరండి'' కార్యక్రమంలో మొదటి బహుమతి వస్తే సింగపూరు, హాంకాంగ్ వెళ్లి రావచ్చండి. ఇంకా బి తెలుగు టీవీ వాళ్లు పెట్టే 'మెదడుకు పదును పెట్టండి-అసలు దొంగని పట్టండి' కార్యక్రమంలో మొదటి బహుమతి ఐదు



లక్షలు వస్తే మనం ఫస్ట్ ఫ్లోర్ కడదాం. మీనాక్షిగారు మాకు అన్నిట్లో ఫుల్ ట్రైనింగ్ ఇచ్చారండి'' మీనాక్షి పేరు వింటూనే సుబ్బారావుకి పీకల దాకా కోపం వచ్చింది. వళ్లు మండింది. తన భార్యకి ఈ పిచ్చి అంటించింది మీనాక్షే.

ఈ పిచ్చి నుండి వనంని కాపాడుకోవటం ఎలా? సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. 'తను ఎంత చెప్పినా వనం వినిపించుకోదు. మరి ఏం చేయాలి? అటు నుంచి నరుక్కుని వస్తే' సుబ్బారావుకి ఆలోచనలతో నిద్ర పట్టలేదు.




పది రోజుల తర్వాత సుబ్బారావు ఆఫీసు నుండి వచ్చేసరికి వనజాక్షి చాలా దిగులుగా సోఫాలో కూర్చుని ఉంది.

సుబ్బారావుని చూస్తూనే వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

''ఏమండి... ఏమండి...'' వనజాక్షికి మాటలు రావటం లేదు. దగ్గరవాళ్లు ఎవరైనా బకెట్ తన్నేశారా అని కంగారు పడ్డాడు సుబ్బారావు.


''వనం. ఎవరు పోయారు?'' ఆదుర్దాగా అడిగాడు.

''మీనాక్షిగారి వాళ్ల ఆయన...'' అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది వనజాక్షి.

''ఏమిటి! మీనాక్షి వాళ్ల ఆయన పోయారా? ఎప్పుడు? ఎలా?'' కంగారుగా అడిగాడు సుబ్బారావు.

## సరికొత్త అందాల సింధు

**సింధు తులానీకి ఆమధ్య అవకాశాలు బాగానే వచ్చాయి. కానీ ఇటీవల కాలంలో తెలుగులో 'నీ నవ్వే చాలు' తర్వాత చెప్పుకోదగిన సినిమాలు లేవు. అయితే తమిళంలో కాస్త బిజీగానే వుంది. తన గ్లామర్‌లో కాస్త మార్పులు చేసుకుంటే చాన్సులు ఇంకా వస్తాయని అనుకుందేమో- దాదాపు 2 లక్షల ఖర్చుతో తన పర్సనాలిటీలో (హిప్స్, వెయిస్ట్‌కి సంబంధించి) కొన్ని మార్పులు సింధు చేసుకుందని టాలీవుడ్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. సరికొత్త అందాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకునే ప్రయత్నంలో సింధు వుందన్నమాట.**



''ఆయనకి ట్రాన్సఫర్ అయిందండి. రేపే వాళ్లు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు'' మళ్లీ వెక్కివెక్కి ఏడ్చింది వనజాక్షి. తన ప్లాను ఫలించినందుకు సుబ్బారావుకి చాలా సంతోషంగా ఉంది. ''యాహూ...'' అని గట్టిగా అరవబోయి వెంటనే తమాయించుకుని ''ఎంత పని జరిగింది వనం. ఇది నిజంగా విచారించవలసిన విషయం'' అంటూ మొహం విచారంగా పెట్టాడు.

''ఏమండి. మీకు ఎమ్మెల్యేగారు బాగా తెలుసు కదా? ఆయనతో చెప్పి మీనాక్షిగారి ఆయన ట్రాన్స్‌ఫర్ ఆపుచేయించండి'' వనజాక్షి మాటలతో సుబ్బారావు మీద పిడుగు పడినట్లు అయింది. 'ట్రాన్స్‌ఫర్ జరిగిందే ఆయనగారి చలవతో' అన్న సంగతి వనంకి తెలిస్తే ఎంత గొడవై పోతుంది. తను ఎంతో కష్టపడి చేయించిన ట్రాన్స్‌ఫర్‌ని వనం కాన్సిల్ చేయించమంటుంది. వనంని మాయ చేయాలి' కొంచెం సేపు ఆలోచించి సుబ్బారావు మెల్లగా అన్నాడు.

''వనం, ప్రస్తుతం ఆయన ఢిల్లీలో ఉన్నారు. రెండు రోజుల దాకా రారు. నీ కోసం, ఆయన ఢిల్లీ నుండి వస్తూనే ట్రాన్స్‌ఫర్ ఆగే ప్రయత్నం చేస్తా. ఆ సంగతి నువ్వు మరచిపో. అంతా నేను చూసుకుంటాను'' అంటూ వనజాక్షిని ఓదార్చాడు సుబ్బారావు.

తర్వాత రెండు రోజులకి మీనాక్షి వాళ్లు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిన తర్వాతగానీ సుబ్బారావు హాయిగా ఊపిరి పీల్చుకోలేకపోయాడు. వనజాక్షి విచారంగానే ఉండిపోయింది. సుబ్బారావుకి చాలా సంతోషంగా ఉంది.

వారం తర్వాత...

సుబ్బారావు ఆఫీసు నుండి వస్తూనే వనజాక్షి ఎదురువచ్చింది. చాలా సంతోషంగా ఉంది. సుబ్బారావు గుండెల మీద తల ఆన్చుతూ, ''ఏమండి, మీకో శుభవార్త'' అంది.

సుబ్బారావు కొంచెం తికమకపడ్డాడు.

''ఏమిటి. నేను తండ్రిని కాబోతున్నానా?'' కొంచెం థ్రిల్‌గా ఫీలవుతూ అడిగాడు.

''మీకు ఎప్పుడూ అదే గోల'' కొంచెం చిరాగ్గా అంది వనజాక్షి.

''మన పక్కింట్లో కామాక్షిగారనే ఆవిడ అద్దెకు దిగారు. ఈమెకి మీనాక్షిగారి కంటే ఎక్కువ జనరల్ నాలెడ్జ్ ఉందండీ. నాకు ఎంత సంతోషంగా ఉందో తెలుసా?'' అంటూ సుబ్బారావుని పట్టుకుని గిరగిరా తిప్పింది వనజాక్షి.

కళ్లు తిరిగి తూలిపడబోయి ''ఎంత పని జరిగింది దేవుడా!'' అంటూ తల పట్టుకుని సోఫాలో కూలబడ్డాడు సుబ్బారావు.

☆